# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటిస్తున్నారు.**

**2.** **ప్రజలందరి భాగస్వామ్యంతోనే మాతృభాషా పరిరక్షణ సాధ్యమవుతుందని సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.**

**3.** **ప్రభుత్వ వసతిగృహాల పనితీరు మెరుగుపర్చేందుకు త్వరలో ఇన్‌స్పెక్షన్ యాప్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత వెల్లడించారు.**

**4.** **బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి.**

**5.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈ నెల 29వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది.**

==========================

కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా గంగూరు, ఈడుపుగల్లు గ్రామాలను సందర్శించారు. గంగూరులోని రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వివరాలను సిబ్బంది, రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికంగా జరిగే రెవెన్యూ సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని.. ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారు.

--------------------------

ప్రజలందరి భాగస్వామ్యంతోనే మాతృభాషా పరిరక్షణ సాధ్యమవుతుందని సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విశాఖపట్నంలోని పౌరగ్రంధాలయంలో నిర్వహించిన పరవస్తు చిన్నయసూరి జయంతి కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరవస్తు చిన్నయసూరి రచించిన భావ వ్యాకరణం, నీతిచంద్రిక నేటికీ నిత్యనూతనంగా ఉన్నాయని తెలిపారు. ప్రాధమిక విద్య మాతృభాషలోనే జరగాలని అన్నారు. రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

--------------------------

ప్రభుత్వ వసతిగృహాల పనితీరు మెరుగుపర్చేందుకు త్వరలో ఇన్‌స్పెక్షన్ యాప్ అందుబాటులోకి

తీసుకురానున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వసతిగృహాలనిర్వహణ–విద్యార్థుల భద్రత అంశంపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వసతిగృహాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని ప్రకటించారు. అధికారులు తరచూ వసతిగృహాలను తనిఖీ చేయాలని, అక్కడి పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు.

---------------------------

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ హెచ్చరించారు. తొట్టంబేడు మండలం విరూపాక్షపురంలోని స్వర్ణముఖి నది ఇసుక రీచ్‌ను ఆయన ఈరోజు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..

వాయిస్ ( 25 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో భారత వాతావరణ కేంద్రం అందిస్తున్న సేవలపై ఈరోజు విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ ఎస్.రమేష్ "ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అమరావతి వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్.స్టెల్లా, భారత వాతావరణశాఖ డైరెక్టర్ జనరల్ ఎమ్.మహాపాత్ర, రాష్ట్ర రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.పి.సిసోడియా పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా వాతావరణ సమాచారంపై వివిధ సంస్థలకు, విభాగాలకు చెందిన సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో ఇంధన పొదుపును తప్పనిసరి అలవాటుగా మార్చుకోవాలని బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ కోరారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యుత్ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో బాపట్లలో చేపట్టిన ర్యాలీని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రఖర్ జైన్ మాట్లాడుతూ

..వాయిస్ ..35 సెకన్లు

---------------------------

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది. కోస్తాంధ్రలో పలు చోట్ల మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కాగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో గత రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో పలుచోట్ల ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది.

---------------------------

అల్పపీడన ప్రభావంతో శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న దృష్ట్యా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె. త్రినాథ స్వామి సూచించారు. పొందూరు

మండలం కింతలి గ్రామంలో వరి పంటను ఆయన ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా త్రినాథ స్వామి మాట్లాడుతూ

వాయిస్ ( 34 సెకన్లు)

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది.."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఈ రోజు అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచంలో పేదరికం, ఆకలి వంటి మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలు కలిసి పని చేయాలన్నదే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు ఏటా డిసెంబర్ 20వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ప్రపంచ సంఘీభావ నిధిని ఐక్య రాజ్య సమితి 2002 డిసెంబర్ 20వ తేదీన ఏర్పాటు చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది. అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవాన్ని మొదటి సారిగా 2006లో నిర్వహించారు.

---------------------------

రాష్ట్రంలో ఇమామ్, మౌజమ్‌లకు గౌరవవేతనాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఒక ప్రకటనలో తెలిపారు.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈ వేతనం వర్తిస్తుందని చెప్పారు. ఆదాయం లేని మసీదుల్లోని ఇమామ్‌లకు 10 వేలు, మౌజమ్‌లకు 5 వేల రూపాయల చొప్పున నెలకు గౌరవవేతనాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇమామ్‌లు, మౌజమ్‌లకు గౌరవ వేతనం కొనసాగించడానికి సంవత్సరానికి 90 కోట్ల రూపాయలు ప్రభుత్వం కేటాయిస్తున్నట్లు మంత్రి వివరించారు.

---------------------------

పరిపాలనా సౌలభ్యం కోసం కృత్రిమ మేధ -ఏఐను వినియోగించుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రియల్ టైం గవర్నెన్స్-ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కె.దినేష్‌కుమార్ తెలిపారు. ఢిల్లీలోని గూగుల్ కార్యాలయంలో కృత్రిమ మేధపై జరిగిన కార్యశాలలో నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏఐని వినియోగించుకుని, పాలన మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జనన, మరణ, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలను సులభంగా ఒకేచోట అందించేలా రాష్ట్ర ఐటీ శాఖ పనిచేస్తోందని అన్నారు.

---------------------------

శ్రీకాకుళం జిల్లా అరసవెల్లి శ్రీ సూర్యనారాయణస్వామి దేవస్థానంలో నిర్వహించే రథసప్తమిని రాష్ట్రస్థాయి పర్వదినంగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 4న శ్రీ సూర్యనారాయణస్వామి రథసప్తమి వేడుకలు జరగనున్నాయి.

====================